క్లుప్తంగా

25వ వార్డులో డ్రై డే



నిల్వనీటిని పారబోయిస్తున్న రాధిక

హుజూరాబాద్: పట్టణంలోని 25వ వార్డులో మంగళవారం డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం పారిశుధ్య సిబ్బందితో మురుగునీటిని తొలగింపచేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, వార్డు కౌన్సిలర్ వెన్నంపల్లి కిషన్, కమిషనర్ సమ్మయ్య, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, శానిటరీ జవాన్లు ప్రతాపరాజు, రమేశ్, డాక్టర్ జరీనా తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరానికి స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇల్లందకుంట: మండలంలోని పాతర్లపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి తులసిదాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా విశేషస్పందన లభించింది. శిబిరంలో గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. హెల్త్‌ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి సీజనల్ వ్యాధుల గూర్చి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వి.శ్యామల, సూపర్‌వైజర్ అనిత, రాజేశ్, సత్యమ్మ, మానస, మమత, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కవ్వంపల్లి

శంకరపట్నం: మండలంలోని గద్దపాక గ్రామానికి చెందిన యువకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. యువకులకు కవ్వంపల్లి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ మోసపూరిత వాగ్దాలను నమ్మలేక పార్టీలో చేరుతున్నామని యువకులు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

వీణవంక: మండల కేంద్రానికి చెందిన చింతల రంజిత్,రజిత దంపతులు ఇటీవల మృతి చెందడంతో వీరి కుమారుడు వర్షిత్ అనాథగా మారాడు. వీణవంకకు చెందిన ట్యూరిటో, యుప్ టీవీ సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి అనుచరుల ద్వారా రూ.5 వేలు వర్షిత్‌కు అందించారు. అదేవిధంగా చదువు కోసం ప్రతినెల రూ.వెయ్యి చొప్పున స్కాలర్‌షిప్ అందించనున్నామని ప్రకటించారు. ఈసందర్భంగా ఉదయానందన్‌రెడ్డిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య, సమీండ్ల చిట్టి, దాసారపు లోకేశ్, వంశీకృష్ణ, తాళ్లపల్లి కుమారస్వామి, పస్తం కుమార్, చిన్నాల శ్రీకాంత్ ఉన్నారు.

పాలంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు భాషా దినోత్సవం



బహుమతులు ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం

తిమ్మాపూర్: మండలం పాలంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గిడుగు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు తెలుగు పద్య, పఠన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వక్తలు ఉపాధ్యాయులు తెలుగు భాషా గొప్పతనం, రామ్మూర్తి సేవలను వివరించారు. హెచ్‌ఎం మాడ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌జీఅయ్యంగార్, అబ్దుల్ వలి, పిట్టల తిరుపతి, కనకం భారతి రౌతు రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ దేశానికి దిక్సూచి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- నియోజకవర్గ అభివృద్ధిలో మానకొండూర్ రెండోస్థానం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్‌రూరల్: బడుగు, బలహీన వర్గాలకు ఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశానికి తెలంగాణ ప్రభుత్వం దిక్సూచిగా మారిందని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదట ఎంపీడీవో కార్యాలయంలోని నూతన సీసీ రోడ్డును ప్రారంభించారు. సమావేశంలో 19 శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గ అభివృద్ధిలో జిల్లాలో మానకొండూర్ రెండో స్థానంలో ఉన్నందుకు గర్వంగా ఉందని, ఒక్కో గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంచుకొని అధికారులు, నాయకుల సహకారంతో అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకున్నామని పేర్కొన్నారు. పేదల ఆరోగ్య అవసరాలను దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రానికి రూ.17కోట్ల నిధులతో నూతన 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంజూరు చేశామని, పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. రూ.1.50 కోట్లతో లక్ష్మీపూర్‌లో నూతన ప్రభుత్వ హాస్పిటల్ పనులు పూర్తికానున్నాయని, మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా 19 పాఠశాలల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయని, విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు, అధికారులు కృషిచేయాలన్నారు. గ్రామాల్లో అన్ని కుల సంఘ భవనాలను పూర్తిచేశామని, సీసీరోడ్లు వేయించామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 1250 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేశాం, కొత్తగా వచ్చిన గృహలక్ష్మి పథకం ద్వారా అర్హులకు రూ.3లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక చేయూత కింద బీసీ, మైనార్టీ బంధు నిరంతరం కొనసాగుతాయని అర్హులందరికీ మంజూరుచేస్తామని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. రుణమాఫీ 70 శాతం రైతులకు అందించామని, రూ.5లక్షల రైతుబీమ, ఉచిత కరెంటు అందిస్తున్న ప్రభుత్వం బీఆర్‌ఎస్ మాత్రమేనని, మండలంలోని వివిధ గ్రామాల రైతులు పంటలు పండించుకోవటానికి గోదావరి నీటిని కాలువల ద్వారా తీసుకవచ్చి లక్షల ఎకరాలకు సాగునీరు అందించి పంటలను పండించి సస్యశ్యామలం చేశామన్నారు. గ్రామాల్లో పూర్తికాకుండా మిగిలిన పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచు, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో యువత ఆటలు ఆడుకోవడానికి ఆటవస్తువులను ప్రభుత్వం పంపిణీ చేసిందని త్వరలో సర్పంచులు అందజేస్తారని పేర్కొన్నారు. అనంతరం దశాబ్ది ఉత్సవాల పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ప్రతి గ్రామపంచాయతీకి పుస్తకం అందజేస్తామని, మండలంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలు, నాయకులు గుర్తించాలని, రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులకు 30శాతం వేతనాలు పెంచినందుకు కళాకారులు ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే రసమయికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ముద్దసాని సులోచన, జెడ్పీటీసీ శేఖర్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, వివిధగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



చొప్పదండి: ప్రశంసా పత్రాలతో విద్యార్థులు



తిమ్మాపూర్: మెడల్ అందిస్తున్న హెచ్‌ఎం



హుజూరాబాద్‌రూరల్: ఏకశిలా హైస్కూల్‌లో..

చొప్పదండి: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్‌లో మంగళవారం క్రీడాకారులకు నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ వెంకటరాంబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్ బహుమతులు, మెమొంటోలు అందించారు. ప్రిన్సిపాల్ రమేశ్, నవతరం యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో క్రీడా దినోత్సవం హెచ్‌ఎం కరుణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

శంకరపట్నం: మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, అనిల్, మహిపాల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ఏకశిలా హైస్కూల్‌లో ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించామని ప్రిన్సిపాల్ బి. లక్ష్మణ్ తెలిపారు. ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి. తిరుపతిరెడ్డి హాజరై ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఇన్‌చార్జి నరేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్ తిరుపతి అనిల్, పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని మొగిలిపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు తిరుమల, జ్యోతి, లక్ష్మీరాజ్యం, పీఈటీ ఆడెపు శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి రాములు

చొప్పదండి: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సెప్టెంబర్ 1న నిర్వహించే ధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు కోరారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. పీఆర్‌సీ కమిషన్‌ను నియామకం చేసి మధ్యంతర భృతి ప్రకటించాలని, ఉపాధ్యాయ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, నాన్చుడు ధోరణి వదిలి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏసుదాసు, పల్లవి, సూర్యప్రకాశ్, రామస్వామి, జయలక్ష్మి, పుష్పలత, హరిలీల, సరిత, గోపాల్ పాల్గొన్నారు.

సైదాపూర్‌లో 2కే రన్



2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

సైదాపూర్: ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి మంగళవారం 2 కే రన్‌ను ప్రారంభించారు. బాలికల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు జంపాల అక్షయ, జంపాల శృతి, కొండ అభినయ, బాలురలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గూళ్ల సంతోష్, సుంకె వంశీ, గూళ్ల కార్తిక్‌కు ఏసీపీ జీవన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్, ఎస్‌ఐ ఆరోగ్యం, సర్పంచ్ గణేశ్, ఎంపీటీసీ ఓదేలు, వాకర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు విద్వాన్‌రెడ్డి, సామాజిక కార్యకర్త కుమార్‌రాజా, మాజీ సర్పంచ్ పోలోజు రాజు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా సాగాలి



మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్: గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలో మండలంలోని ఉప సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, పార్టీ ఇన్‌చార్జీలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా గ్రామాల్లో కమిటీలు వేసుకుని ప్రణాళిక ప్రకారం పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గోవిందారెడ్డి, సర్పంచ్ పృథ్వీరాజ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌పై అసత్య ఆరోపణలు'

శంకరపట్నం: ఇటీవల నిర్వహించిన యువగర్జన సభకు వందలాది యువజన నాయకులు తరలిరావడాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్ష నాయకులు బీఆర్‌ఎస్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని దళిత సంఘం నాయకులు ఆరోపించారు. మండలంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీసర్పంచ్ వీరస్వామి, వైస్‌ఎంపీపీ రమేశ్‌లను వేదికపై అగౌరవపరిచారన్న విషయాన్ని ఖండించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు ఆదరిస్తున్నారని రాబోయే రోజుల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పట్టం కడతారని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్, ఎంపీపీ రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఓనం పండుగ



హుజూరాబాద్: పట్టణంలోని మాంటిస్సోరి, కేరళ ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో మంగళవారం కేరళ ఓనం పండుగను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థుల సాంప్రదాయ వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్: దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని ముంజంపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో దివ్యాంగుల పెన్షన్ ప్రొసీడింగ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగుల కష్టసుఖాలను అర్థంచేసుకుని పింఛన్‌ను రూ. నాలుగు వేలకు పెంచారని, ఇంటి పెద్దకుమారుడిగా ఆదుకుంటున్న కేసీఆర్‌ను ప్రతిఒక్కరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. మండలంలోని 1800 మంది దివ్యాంగులకు పెన్షన్ అందుతుందని, అర్హులైన ప్రతిఒక్కరికి పింఛన్ మంజూరు చేస్తామన్నారు. జెడ్పీటీసీ శేఖర్, ఎంపీపీ సులోచన, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, సర్పంచ్ పృథ్వీరాజ్, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: దివ్యాంగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్లను పెంచిందని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో దివ్యాంగులకు ఆసరా పెన్షన్ ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. గత ప్రభుత్వాలు దివ్యాంగులను పట్టించుకోలేదని సీఎం కేసీఆర్ ఆసరా పెన్షన్లను పెంచారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతిరెడ్డి వనిత దేవేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, నాయకులు దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వీరారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, దుద్దెనపెల్లి సొసైటీ చైర్మన్ రాధాకిషన్ రావు, ఎంపీడీవో చింతల రవీందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన అంబేడ్కర్ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు మాతంగి సంపత్(45) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూనేనాయకుడిగా పేరు తెచ్చుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంపత్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు.

మూఢనమ్మకాలతో మోసపోవద్దు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందం

జమ్మికుంట: ప్రజలు మాయమాటలు, మూఢనమ్మకాలతో మోసపోవద్దని హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి సూచించారు. మంగళవారం రాత్రి మండలంలోని నాగంపేటలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు పట్టణ సీఐ బార్పటి రమేశ్ ఆధ్వర్యంలో గ్రామంలో పోలీస్ కళాబృందంతో మూఢనమ్మకాలు, చెడు వ్యసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుల్లో రాణించి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. షీటీమ్ విధి విధానాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్త ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే జరిమానాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీధర్, సర్పంచ్ చందుపట్ల స్వాతి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ రాజయ్య, ఉప సర్పంచ్ అశోక్, పోలీస్ కళా బృందం ఇన్‌చార్జి కాంతయ్య, టీం సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

గన్నేరువరం: మండలంలోని వివిధ గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ నాయకులు మంగళవారం తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో పేరుకుపోయిన భూ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పరిష్కారం కోసం అయోమయానికి గురవుతున్నారని, ధరణిలో నెలకొన్న లోటుపాట్లను ప్రభుత్వం సరిదిద్దాలని డిమాండ్ చేశారు. సాదాబైనామాలతో కొనుగోలు చేసిన భూములకు పరిష్కారం చూపాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీశైలం, మండల కోశాధికారి శ్రీనివాస్, యువజన నాయకులు మొలుగురి ఆంజనేయులు, మండల నాయకులు బోయిని మల్లయ్య, కూన మల్లయ్య, కొమురయ్య, బాలయ్య పాల్గొన్నారు.

జాతీయ టార్గెట్ బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో కరస్పాండెంట్

చొప్పదండి: పట్టణంలోని సిద్దార్థ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు టార్గెట్ బాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ధనశ్రీ, శివరాం ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ దాసరి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అభినందించి, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కో–ఆర్డినేటర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై హర్షం

ఇల్లందకుంట: కాంగ్రెస్ పార్టీ దళితుల అభ్యున్నతే ధ్యేయంగా ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించడం పట్ల కాంగ్రెస్ పార్టీ ఇల్లందకుంట మండల మహిళా అధ్యక్షురాలు కోడెం రజిత హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని పాతర్లపల్లి గ్రామంలో మంగళవారం మాట్లాడారు.

రామడుగు: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ విప్లవాత్మక నిర్ణయమని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎండీ అజ్జు

హుజూరాబాద్: మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అజ్జు అన్నారు. మంగళవారం జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని, 11వ పీఆర్‌సీ అమలు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ఉపాధ్యక్షులు సరోజన, క్రాంతికుమార్, సమ్మక్క, గొట్టం రాజమౌళి, సహాయ కార్యదర్శి రాజేశ్, కోశాధికారి రాజేశ్వరి, ప్రచార కార్యదర్శి రాజ్‌కుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జి చిరంజీవి, ముఖ్య సలహాదారుడు అందె వీరాస్వామి తదితరులు ఉన్నారు.

రుణాలు చెల్లించకపోవడంతో ప్రాపర్టీ సీజ్



షట్టర్స్‌ను ఖాళీ చేస్తున్న కిరాయిదారులు

జమ్మికుంట: పట్టణంలో ఓ ఇండస్ట్రీస్ యజమానులు బ్యాంక్‌లో తీసుకున్న రుణాలు చెల్లించకపోవడంతో కరీంనగర్ చీఫ్ జస్టిస్ ఉత్తర్వుల మేరకు నివాసం, వ్యాపారం చేసుకునేందుకు తీసుకున్న కిరాయిదారుల షటర్లను ఖాళీ చేయించడం పట్టణంలో చర్చనీయంశంగా మారింది. వివరాలు.. పట్టణానికి చెందిన మామిడాల భగీరథ, మామిడాల శ్రీధర్‌లు కామాక్షి ఇండస్ట్రీస్ పేరుతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్‌లో రుణాలు తీసుకున్నారు. పట్టణ ప్రధాన రోడ్డులో వారికి చెందిన ఇల్లు, వ్యాపార సముదాయాల షట్టర్స్‌ను షూరిటీగా చూపించారు. కొన్ని నెలలుగా రుణాలు చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులకు కోర్టు ద్వారా ప్రాపర్టీ సీజ్ ఉత్తర్వులు పొందారు. దీంతో మంగళవారం మిల్లు యజయానుల ఇల్లు, ఎనిమిది షటర్స్‌ను పోలీసుల ప్రొటెక్షన్‌తో ఖాళీ చేయించి సీజ్ చేశారు. దీంతో షట్టర్లను కిరాయికి(అద్దె) తీసుకున్న చిరువ్యాపారాలు ఆందోళనకు గురయ్యారు. షాపులోని వస్తువులతో సహా సీజ్ చేస్తామనడంతో షాపుల్లోని వస్తువులు, ఇతర సామగ్రిని హుటాహుటిన ఖాళీ చేశారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు

జమ్మికుంట: కులం పేరుతో దూషించన ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని టౌన్ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. పట్టణానికి చెందిన పొల్నేని సంపత్‌రావు, సిద్దూరి సంపత్‌రావు మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో జరిగిన ఓ భూమి పంచాయితీలో పెద్ద మనిషిగా వచ్చిన ఇల్లందకుంట మండలానికి చెందిన రామంచ భద్రయ్య అలియాస్ భరత్‌ను కులం పేరుతో దూషించి అవమానపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సైదాపూర్: మండలంలోని బొత్తలపల్లిలో మంగళవారం ఓ ఇంట్లో పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.4,060 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై ఆరోగ్యం తెలిపారు. పేకాట, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదుపు తప్పి ఇసుక లారీ బోల్తా

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి పంచాయతీ పరిధి శాంతినగర్ మూలమలుపు వద్ద మంగళవారం ఓ ఇసుక లారీ అదుపు తప్పి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. రోడ్డుపై గొర్రెల మంద రావడంతో వేగాన్ని అదుపు చేసే క్రమంలో బోల్తా పడినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు ప్రాణాపాయం తప్పిందని చెప్పారు. కాగా, పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కిష్టంపేట ఇసుక క్వారీ నుంచి ఇసుక తరలిస్తున్న లారీగా తెలిసింది.

ఆధ్యాత్మికం

మకరతోరణం బహూకరణ



మానకొండూర్: మండల కేంద్రంలోని శ్రీ బాలాంజనేయస్వామి ఆలయానికి మంగళవారం గట్టుదుద్దెనపల్లి సర్పంచ్ దేవ సతీశ్‌రెడ్డి మరకతోరణం బహూకరించారు. సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, నాయకులు మధు, రాజయ్య, లక్ష్మీనారాయణ, బలరాం, బొద్దుల ఆంజనేయులు, నామాల శ్రీనివాస్, పిండి సందీప్, పడాల సతీశ్ గౌడ్, మాదాసు సంతోష్, వెంకటస్వామి, అర్చకులు నమిలికొండ రమణాచార్యులు, రామోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మానసాదేవి ఆలయంలో శ్రావణ సందడి

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయంలో శ్రావణ సందడి నెలకొంది. ప్రతి మంగళ, శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మామిడాల నాగసాయిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తులకు అన్నదానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



గన్నేరువరం: మానసాదేవి ఆలయంలో భక్తులు

ముందస్తు రక్షా బంధన్



హుజూరాబాద్: బ్రహ్మకుమారి సంస్థ కార్యాలయంలో మంగళవారం ముందస్తు రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. బ్రహ్మకుమారి బెహింజి సవిత పలువురికి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోదర, సోదరిమణుల మధ్య ఉన్న ప్రేమను తెలియజేసేది రాఖీ పండగని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్‌కు రాఖీ కట్టారు. కార్యక్రమంలో ఓం శాంతి హుజూరాబాద్ కేంద్రం నిర్వాహకురాలు బ్రహ్మకుమారి ప్రణీత, జమ్మికుంట కేంద్ర నిర్వాహకురాలు నిర్మల, బీకే సునీల్, తాళ్లపల్లి రమేశ్, కొలిపాక శ్రీనివాస్, తాళ్లపల్లి శ్రీనివాస్, ఈశ్వరయ్య, రాజయ్య, జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.